క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణం

మధురానగర్(విజయవాడసెంట్రల్):మాచవరం దాసాంజనేయస్వామివారి దేవాలయంలో శనివారం ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం హనుమాన్ చాలీసా పారాయణం జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని, ధర్మకర్తల మండలి చైర్మన్ కనపర్తి కొండలరావు పర్యవేక్షించారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):వివాహిత అదృశ్యమైన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఘటనపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తూరు తాడేపల్లికి చెందిన కొత్తపల్ల శ్రీహరి, ప్రియాంకలు భార్యాభర్తలు. శ్రీహరి క్రేన్ ఆపరేటర్‌గా పని చేస్తుంటాడు. 17వ తేదీ ప్రియాంక అత్త గారికి అనారోగ్యంగా ఉండటంతో వైద్యం నిమిత్తం విజయవాడకు వచ్చింది. సాయంత్రం ప్రియాంక ఫోన్ నుంచి నా ఇష్టపూర్వకంగా వెళుతున్నాను... నా గురించి వెతకవద్దని మెసేజ్ రావడంతో ఆందోళన చెందిన భర్త పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

కుటుంబ నియంత్రణ పద్ధతులపై శిక్షణ



లబ్బీపేట(విజయవాడతూర్పు):కుటుంబ నియంత్రణ పద్ధతులైన ట్యూబెక్టమీ, వేసక్టమీ, ప్రసవానంతరం వేసే ఐయూసీడీలపై పీహెచ్‌సీ వైద్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వాస్పత్రి గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ హిమబిందు ఆధ్వర్యంలో డాక్టర్ కరుణావతి శిక్షణలో పాల్గొన్న వారికి అవగాహన కలిగించారు. ప్రసవానంతరం వేసే పీపీఐయూసీడీలను అత్యంత జాగరూకతతో అమర్చాలని సూచించారు. వీటిని అత్యధికంగా ప్రమోట్ చేయాలన్నారు. శిక్షణ ముగించుకున్న మొదటి బ్యాచ్ వైద్యులకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని సర్టిఫికెట్స్ అందచేశారు. డాక్టర్ నవీన్, గణాంక అధికారి యస్ లక్ష్మోజీ తదితరులు పాల్గొన్నారు.

కళాకారుల సంక్షేమానికి కృషి



విజయవాడ కల్చరల్: వైఎస్సార్ సీపీ సాంస్కృతిక విభాగం ద్వారా కళాకారుల సంక్షేమానికి కృషి చేస్తానని గాయకుడు సంగీత దర్శకుడు డాక్టర్ సుషీల్‌కుమార్ తెలిపారు. డ్రీమ్ ఆడియో ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా సాంస్కృతిక శాఖ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు తీసుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని ఆత్మీయ సత్కార కార్యక్రమం, సినీ సంగీత విభావరి శనివారం నిర్వహించారు. సత్కారం అనంతరం ఆయన మాట్లాడుతూ కళాకారుల సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. సీనియర్ గాయకుడు బాలాజీకుమార్ సుషీల్ కుమార్ సాంస్కృతిక సేవలను వివరించారు. ప్రభుత్వం కళాకారుల కోసం పనిచేస్తున్నట్లు తెలిపారు. డ్రీమ్ ఆడియో అధినేత చావా నరసింహారావు చేతులమీదుగా డాక్టర్ సుషీల్ కుమార్‌ను సత్కరించారు. నగరానికి చెందిన గాయనీ గాయకులు రసూల్‌బాబు, వాసిరెడ్డి శ్రీనివాస్, భారతి, విష్ణుప్రియ, సింధూ దర్శకుడు వంశీ దర్శకత్వం వహించిన చిత్రాలలోని పాటలను ఆలపించారు.

నూతన ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):నూతన ఆవిష్కరణలపై విద్యార్థులు దృష్టి పెట్టాలని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (రాయపూర్) ఈఈఈ విభాగ ఆచార్యులు డాక్టర్ సీహెచ్ అనిల్‌కుమార్ తెలిపారు. పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో రీసెంట్ ట్రెండ్స్ ఇన్ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ అంశంపై ఆ కళాశాల ట్రిపుల్‌ఈ విభాగం ఆధ్వర్యంలో జాతీయ సదస్సు శనివారం నిర్వహించారు. ముఖ్యవక్తగా హాజరైన డాక్టర్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ విద్యుత్ రంగంలో విస్తృతమైన ఉపాధి అవకాశాలు ఉన్నాయని చెప్పారు. నూతన ఆలోచనలతో కొత్త వాహనాల తయారీకి ముందుకు వస్తే మరిన్ని అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఆ దిశగా విద్యార్థులు తమ మేథస్సుకు పదును పెట్టాలన్నారు. ఆధునాతన సాంకేతిక వృద్ధిని తెలుసుకుంటూ తమను తాము తీర్చిదిద్దుకోవాలని సూచించారు. మరో అతిథిగా హాజరైన డాక్టర్ ఈఆర్ఎం కాటయ్య మాట్లాడుతూ నూతన ఆవిష్కరణల కోసం ప్రయోగాలపై దృష్టి పెట్టాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె. లక్ష్మీనారాయణ మాట్లాడారు.

ఆశాజనకంగా పన్నుల వసూళ్లు

- 2022-23 ఆర్థిక సంవత్సరం ముగింపులో పన్నుల వసూళ్లలో వేగం
- ఆస్తిపన్ను రూ.156 కోట్లు డిమాండ్ ఉండగా 80 శాతం వసూలు
- తాగునీరు, డ్రైనేజీ పన్నులు కూడా 50 శాతం పైగా వసూలు
- 3 సర్కిళ్ల పరిధిలో 24 కలెక్షన్ కేంద్రాలు



విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయం

పటమట(విజయవాడతూర్పు):విజయవాడ నగర పాలక సంస్థ 2022-23 ఆర్థిక సంవత్సరంలో పన్నుల వసూళ్లు ఆశాజకంగా సాగుతోంది. దీర్ఘకాలికంగా పేరుకుపోయిన మొండి బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించటంతో ఈ ఏడాది పన్నుల వసూళ్ల లక్ష్యాన్ని సాధిస్తామని అధికారులు ప్రకటించారు. పన్నుల వసూళ్లలో వీఎంసీ రెవెన్యూ విభాగం క్షేత్రస్థాయి సిబ్బందితోపాటు సచివాలయ సెక్రటరీల ప్రమేయం తోడవ్వటంతో నగరంలో మొత్తం 2.7 లక్షల ఎసెస్‌మెంట్లకు 2022-23 ఏడాదికి ఆస్తిపన్ను డిమాండ్ రూ.156.46 కోట్లుండగా ఇప్పటి వరకు 80 శాతం వసూళ్లతో రూ. 124.48 కోట్లు వసూళ్లయ్యాయి. గత ఏడాది ఈ సమయానికి రూ. 106 కోట్లు మాత్రమే వచ్చాయి. కుళాయి కనెక్షన్లు మొత్తం 1.28 లక్షలు ఉండగా వాటికి తాగునీటి పన్ను గత ఏడాది రూ. 24.82 కోట్లు మాత్రమే వసూళ్లవ్వగా ఈ ఏడాది రూ. ఇప్పటి వరకు రూ. 32.8 కోట్లు వచ్చాయి. నగరంలో మొత్తం 50 వేల యూజీడీ (అండర్ గ్రౌండ్ డ్రైనేజీ) కనెక్షన్లకు డ్రైనేజీ పన్ను రూ. 42 కోట్లు డిమాండ్ ఉండగా గత ఏడాది రూ.25 కోట్లు మాత్రమే వసూళ్లవ్వగా ఈ ఏడాది రూ. 35 కోట్లు వచ్చాయి. ఖాళీ స్థలాల పన్నుల వ్యవహారంలో రూ.200 కోట్లు డిమాండ్ ఉండగా అందులో రూ.22 కోట్లు మాత్రమే వసూళ్లయ్యాయి. గత ఏడాది ఈ విభగంలో రూ. 17 కోట్లు మాత్రమే వచ్చాయి. పన్నుల కలెక్షన్లలో మరింత వేగం పెంచుతామని అధికారులు ప్రకటించారు. పన్ను చెల్లింపుదారుల కోసం నగరంలో ప్రత్యేకంగా మూడు సర్కిళ్లలో 24 కలెక్షన్ సెంటర్లు ఏర్పాటు చేశామని అధికారులు తెలిపారు. పన్నుల వసూళ్లపై అన్ని డివిజన్లలో రెసిడెన్షియల్, వ్యాపార ప్రాంతాల్లో మైక్‌ల ద్వారా, కరపత్రాలతో చేస్తున్న ప్రచారాన్ని ముమ్మరం చేశారు. నగరంలోని ఆస్తిపన్ను, ఖాళీ స్థలాల పన్నులపై విధించిన వడ్డీని ఈ నెల 31వ తేదీ వరకు మాఫీ చేస్తున్నట్లు ఇటీవల ప్రభుత్వం ప్రకటించింది.

లక్ష్యాన్ని చేరుకుంటాం

పన్నుల కలెక్షన్లలో అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది, వార్డు సచివాలయ సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ వసూళ్లు చేస్తున్నాం. కోర్టు కేసులు మినహాయించి మిగిలిన వాటిపై పూర్తిస్థాయిలో దృష్టి సారించాం. ఈ ఏడాది రూ.156 కోట్లు డిమాండ్ ఉండగా లక్ష్యం దిశగా చర్యలు తీసుకుంటున్నాం. మొండిబకాయిలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు పన్ను చెల్లింపులపై అవగాహన కల్పించేందుకు ప్రచార కార్యక్రమాలు చేపట్టాం.

డి. వెంకటలక్ష్మి
వీఎంసీ డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ)

అన్ని ప్రాంతాల అభివృద్ధికి చర్యలు

స్థాయీ సంఘ సమావేశంలో మేయర్ భాగ్యలక్ష్మి



మేయర్ అధ్యక్షతన నిర్వహిస్తున్న స్థాయీ సంఘం సమావేశం

పటమట(విజయవాడతూర్పు):విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలోని అన్ని ప్రాంతాలను మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని మేయర్ రాయన భాగ్యలక్ష్మి తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో స్థాయీ సంఘం సమావేశం శనివారం నిర్వహించారు. మొత్తం 32 ప్రతిపాదనలు రాగా అందులో 27 ఆమోదించగా, రెండు అంశాలను వాయిదా వేశారు. ఒక ప్రతిపాదనను ర్యాటిఫై చేయగా, గత ఎజెండాను ఆమోదిస్తూ ధ్రువపరచగా ఒక అంశాన్ని రికార్డు చేశారు.

ప్రధానాంశాలు :

రాజీవ్‌నగర్‌లోని 63వ డివిజన్ వడ్డెకకాలనీలో ఉన్న మల్టీపర్పస్ హాలును మూడేళ్ల లీజుకు ఇచ్చేందుకు వచ్చిన ప్రతిపాదన, సర్కిల్-2 ఏరియాలోని శ్రీకృష్ణదేవరాయలు షాపింగ్ కాంప్లెక్స్‌లో 14 షాపులు మూడుళ్ల లీజు పొడగింపు అంశంపై సభ్యులు వాయిదా వేస్తూ తీర్మానించారు.

- ఆటోనగర్, రామలింగేశ్వరనగర్‌లోని సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్టీపీలు)పర్యవేక్షణకు నిరంతరం ల్యాబరేటరీల్లో విధులు నిర్వహించేందుకు నియమించిన కెమిస్ట్ కం సూపరింటెండెంట్‌కు మరో ఏడాది పొడిగింపుకు వచ్చిన ప్రతిపాదనపై కమిటీ సభ్యులు ఆమోదం తెలుపుతూ తీర్మానం చేశారు.
- వీఎంసీ ఆధ్వర్యంలో నడుస్తున్న రామరాజ్యనగర్, రాజీవ్‌నగర్, కృష్ణలంక ఏరియాల్లోని మాతా-శిశు కేంద్రాల్లో కాంట్రాక్ట్ పద్ధతిలో వైద్య సేవలు అందిస్తున్న 14 మంది వైద్య సిబ్బంది గడువు ఈ ఏడాది మార్చి 1వతేదీతో ముగిసింది. మరో ఏడాది పాటు వారి కాంట్రాక్ట్ గడువు పొడిగించేందుకు వారికి ఏడాది మొత్తంలో వేతనాలకు అయ్యే రూ. 40.20 లక్షలు కార్పొరేషన్ జనరల్ బడ్జెట్ నుంచి చెల్లింపులు చేయాలని వచ్చిన ప్రతిపాదనను ఆమోదిస్తూ తీర్మానం చేశారు.

బెజవాడలో భారత్ గౌరవ్ రైలుకు ఘన స్వాగతం





విజయవాడ రైల్వే స్టేషన్లో భారత్ గౌరవ్ టూరిస్ట్ ట్రైన్

స్వాగతం పలికిన సీనియర్ డీసీఎం రాంబాబు



ట్రైన్ దగ్గర రైల్వే అధికారులు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలు, చారిత్రక, పర్యటక ప్రదేశాలను దేశ నలుమూలలకు విస్తరించేలా రైల్వే మంత్రిత్వశాఖ భారత్ గౌరవ్ రైళ్లను ప్రవేశపెట్టింది. ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) ఆధ్వర్యంలో దేశంలోని ముఖ్యమైన పుణ్యక్షేత్రాలు, చారిత్రక, పర్యటక ప్రదేశాలను దర్శించుకునేలా 'పుణ్యక్షేత్ర యాత్ర పూరి, కాశి, అయోధ్య' ప్రత్యేక పర్యటక రైలును మొట్టమొదటిసారిగా రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ రైలును శనివారం సికింద్రాబాద్‌లో రైల్వే అధికారులు లాంఛనంగా ప్రారంభించారు. ఈ రైలు విజయవాడకు సాయంత్రం 6 గంటలకు చేరుకోగా సీనియర్ డీసీఎం వావిలపల్లి రాంబాబు, ఇతర అధికారులు రైలుకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం రైల్లోని యాత్రికులను పలకరించి ఈ యాత్ర తమ జీవితంలో చిరస్మరణీయ ప్రయాణంగా గుర్తుండిపోవాలని ఆకాంక్షించారు. అనంతరం మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల ప్రజల సౌకర్యం దక్షిణ మధ్య రైల్వేలోనే మొదటిసారిగా ఈ రైలును రైల్వేశాఖ ప్రవేశపెట్టిందన్నారు. దీనిలో 700 మంది యాత్రికులు రిజర్వ్ చేసుకోగా అందులో విజయవాడ నుంచి 76 మంది యాత్రికులు రైలు ఎక్కారన్నారు. 8 రాత్రుళ్లు, 9 పగళ్లు సాగే ఈ ప్రయాణంలో ఉదయం కాఫీ, అల్పాహారం, భోజనంతో పాటు సందర్శన ప్రదేశాలకు రోడ్డు మార్గంలో రవాణ సదుపాయం, యాత్రికుల భద్రత కోసం ప్రతి కోచ్‌లో సెక్యూరిటీ, సీసీ కెమేరాలు, గైడ్‌లు తదితర ఏర్పాట్లు ఉన్నాయని తెలిపారు. ప్రయాణికుల నుంచి వస్తున్న డిమాండ్‌ను బట్టి ఇదే ప్యాకేజీతో ఏప్రిల్ 18న మరో రైలును నడపనున్నట్లు తెలిపారు. స్టేషన్ డైరెక్టర్ పిబిఎస్ ప్రసాద్, పీఆర్ఓ నుస్రత్ మండ్రుప్కర్, ఏఎస్‌సీ జి.మధుసూదనరావు, ఐఆర్‌సీటీసీ అధికారులు పాల్గొన్నారు.

మానసికస్థితిపై మాదకద్రవ్యాల ప్రభావం

విందిపేట(విజయవాడపశ్చిమ):నవజీవన్ బాల భవన్ విజయవాడ ఆధ్వర్యంలో చిట్టినగర్, జోడుబొమ్మల సెంటర్‌లోని ఆర్‌సీఎం బాలికల ఉన్నత పాఠశాలలో మత్తు పదార్థాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నవజీవన్ బాలభవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్ళమూడి శేఖర్‌బాబు మాట్లాడుతూ దేశ భవిష్యత్తు విద్యార్థుల మీదే ఆధారపడి ఉందన్నారు. తాత్కాలిక సంతోషం కోసం దీర్ఘకాలిక సంతోషాన్ని వదులుకుంటున్నారని చెప్పారు. మాదకద్రవ్యాలు మానసిక స్థితిపై ప్రభావం చూపడమే కాకుండా శరీరంలోని అన్ని అవయవాలను అస్తవ్యస్తం చేస్తాయన్నారు. మత్తు పదార్థాలకు బానిసలైన వారికి డీ-ఎడిక్షన్ చికిత్స ద్వారా సాధారణస్థితికి తీసుకురావచ్చున్నారు. ఈ చికిత్స అందించేందుకు నవజీవన్ బాలభవన్ సంస్థ నూజివీడులో బోస్కో డీ-ఎడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేసిందని తెలిపారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిస్టర్ రూతు మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన విద్యార్థులు, యువతను గుర్తించి డీ-ఎడిక్షన్ సెంటర్‌కు పంపించి చికిత్స అందించాలని సూచించారు. నవజీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్స్ మమతా, మహిళా సంరక్షణ కార్యదర్శులు భార్గవి, గోవిందమ్మ, పద్మ, సునీత, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు సౌకర్యాలు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):హజ్ యాత్రికులకు గతంలో ఎన్నడూ లేని విధంగా గొప్ప సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తుందని జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ గౌస్‌మొహిద్దీన్ అన్నారు. పాతబస్తీలోని స్టార్ ఓల్డ్ ట్రాక్టర్ స్క్రాప్ మర్చంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులను కలిసి హజ్ యాత్రికులకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాల గురించి వివరించారు. గన్నవరం విమానాశ్రయం నుంచి హజ్ యాత్రకు వెళ్లే సౌకర్యాన్ని కల్పించినందుకు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షులు చాన్‌బాషా, ఉపాధ్యక్షుడు ఈసూఫ్ తదితరులు పాల్గొన్నారు.

బుడమేరులో యాంటీ లార్వా ఆపరేషన్

మధురానగర్(విజయవాడసెంట్రల్):బుడమేరులో శనివారం యాంటీ లార్వా ఆపరేషన్స్ చేపట్టారు. కార్పొరేటర్ బీహెచ్ఎస్‌వీ జానారెడ్డి నిర్వహించిన పాదయాత్రలో దోమలు విపరీతంగా పెరిగిపోయాయని పలువురు ఫిర్యాదు చేశారు. దీంతో దోమల నివారణ చర్యలు చేపట్టాలని కార్పొరేటర్ అధికారులను కోరారు. గుర్రపు డెక్కను తొలగించటంతో పాటు యాంటీలార్వా ఆపరేషన్స్ నిర్వహించాలని సూచించారు. ఈ మేరకు నగర పాలక సంస్థ మలేరియా విభాగం అధికారులు చర్యలు తీసుకున్నారు.

పద కవితకు ఆద్యుడు అన్నమయ్య

వేడుకగా అన్నమయ్య జయంతి



మాట్లాడుతున్న కోదండరామయ్య. వేదికమీద కుమార్, సూర్యనారాయణ, గౌరీనాథ్

విజయవాడ కల్చరల్: పదకవితకు ఆద్యుడు అన్నమయ్య అని గాయకుడు ఆకురాతి కోదండరామయ్య అన్నారు. భక్త నారద గాన సభ ఆధ్వర్యంలో దుర్గాపురంలోని ఘంటసాల సంగీత కళాశాలలో శనివారం పద కవితా మహుడు తాళ్ళపాక అన్నమాచార్యుడు 550 వ జయంతి ఉత్సవం, అన్నమయ్య సంకీర్తన కార్యక్రమం నిర్వహించింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న కోదండరామయ్య మాట్లాడుతూ అన్నమయ్య సంకీర్తనలు భక్తిభావ రంజితాలు అని అభివర్ణించారు. అన్నమయ్య శ్రీ వెంకటేశ్వరునిమీద 32 వేల సంకీర్తనలు రచించారని తెలిపారు. టీటీడీ అన్నమయ్య సంకీర్తనలకు విశేష ప్రచారం కలిగిస్తునట్లు చెప్పారు. సంగీత విద్వాంసులు కుమార సూర్యనారాయణ, పోవూరి గౌరీనాథ్, డాక్టర్ పాణ్యం దక్షిణామూర్తి, పాల్గొన్నారు. గాయకుడు కోదండరామయ్య అన్నమయ్య సంకీర్తనలు భక్తిగా ఆలపించారు. దావులూరి వీరభద్రరావు, చిట్టిబాబు, రామ్మోన్ వాద్య సహకారం అందించారు.

నేటి నుంచి సహజయోగ సామూహిక ధ్యాన సభలు



సమావేశంలో మాట్లాడుతున్న ట్రస్ట్ సలహాదారు సాంబశివరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నేటి నుంచి మూడు రోజుల పాటు (19, 20, 21 తేదీల్లో) నగరంలోని కృష్ణలంక పచ్చమేడ బజారులో సహజ యోగ సామూహిక ధ్యాన సభలు నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ సహజ యోగ ట్రస్ట్ సలహాదారు మద్దాల సాంబశివరావు తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సభల వివరాలను వెల్లడించారు. సామాజిక రుగ్మతలకు దివ్య ఔషధంగా సహజ యోగ మార్గాన్ని ప్రపంచానికి మాతాజీ నిర్మలదేవి పరిచయం చేశారన్నారు. ఆమె శత జయంతి ఉత్సవాల సందర్భంగా సహజ యోగ సామూహిక సభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సహజయోగ ధ్యానం ద్వారా అంతర్గత శాంతి, ఆనందం పొందుతారని పేర్కొన్నారు. ప్రతి మనిషిలోనూ నిద్రాణంగా ఉన్న కుండలినీ శక్తిని జాగృతం చేసి చుట్టూ ఉన్న పరమ చైతన్య శక్తితో అనుసంధానం చేయడం ద్వారా మానవునిలో అనూహ్యమైన పరివర్తన తీసుకురావచ్చనే సత్యాన్ని మాతాజీ కనుగొన్నారన్నారు. ట్రస్ట్ సభ్యులు అడపా రామ్మోహనరావు, ఎస్.సుధారాణి, తదితరులు పాల్గొన్నారు.

పంచలోహ నాగసింహాసనం బహూకరణ



ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు సుధాస్వామికి పంచలోహ సింహాసనం అందజేస్తున్న దాతలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్):లెనిన్ సెంటర్‌లోని షిరిడీ నాగ సాయిబాబా-నాగమానసాదేవి అమ్మవారి మందిరానికి అమ్మవారి భక్తులు కనకమేడల భరత భూషణ్ దంపతులు పంచలోహాలతో తయారు చేసిన నాగసింహాసనాన్ని బహూకరించారు. మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు సుధాస్వామికి నాగసింహాసనాన్ని అందించారు. సింహాసనాన్ని అలంకరించి, పూజలు చేసి ఆలయానికి సమర్పించారు. ఈ సందర్భంగా సుధాస్వామి మాట్లాడుతూ గతంలోనూ నాగమానసాదేవి ఆలయానికి భరత్ భూషణ్ శివపార్వతి దంపతులు అమ్మవారి వెండి విగ్రహాన్ని బహుకరించారన్నారు. విగ్రహ పీఠం కోసం పంచలోహాలతో కూడిన సింహాసనాన్ని అందించారని పేర్కొన్నారు. ఉగాది సందర్భంగా అమ్మవారి వెండి విగ్రహాన్ని సింహాసనంపై ఉంచి పూజలు నిర్వహిస్తామని తెలిపారు. కనకమేడల రాజశేఖర్, అఖిల పాల్గొన్నారు.

కాచి చల్లార్చిన నీటిని తాగాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్):కాచి చల్లార్చిన నీటిని తాగాలని ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని గులామొహుద్దీన్‌నగర్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఆయేషా సూచించారు. చుట్టుగుంట అల్లూరి సీతారామరాజు వంతెన సమీపంలోని ఆరోగ్యకేంద్రంలో శనివారం గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ప్రసవం ఆసుపత్రిలోనే చేయించుకోవాలని యూపీహెచ్‌సీ, ఆశ కార్యకర్తల సేవలను వినియోగించుకోవాలని సూచించారు, కమ్యూనిటీ ఆర్గనైజర్ డి.ప్రశాంత్‌కుమార్, ఏఎన్ఎం ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు అత్యధిక ప్రాధాన్యం

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



మహమ్మద్ రఫీని సత్కరిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్):వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా మైనార్టీ విభాగం అధ్యక్షుడిగా నియమితులైన మహమ్మద్ రఫీ ఎమ్మెల్యే మల్లాది విష్ణును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మహమ్మద్ రఫీని ఎమ్మెల్యే మల్లాది విష్ణు శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మల్లాది విష్ణు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మైనార్టీలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తుందని చెప్పారు. తొలి క్యాబినెట్‌లోనే రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పదవిని మైనార్టీలకు కేటాయించారని చెప్పారు. మంత్రి పదవులు, నాలుగు ఎమ్మెల్సీ పదవులు, కార్పొరేషన్ చైర్మన్లుగా, డైరెక్టర్లుగా, మేయర్లుగా, డెప్యూటీ మేయర్లుగా మైనార్టీలను నియమించిందన్నారు. ముస్లింలు రాజకీయంగా, ఆర్థికంగా ఎదిగేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అవకాశాలు కల్పించారన్నారు. వచ్చే ఎన్నికల్లో మైనార్టీలంతా వైఎస్సార్ సీపీ అండగా నిలవాలన్నారు. చల్లా సుధాకర్, ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా, మాచవరం ఆంజనేయస్వామి వారి దేవస్థానం ట్రస్ట్ బోర్డు మెంబర్ యక్కల మారుతి, ఎన్టీఆర్ జిల్లా డైరెక్టర్‌లు మొహమ్మద్ అఫ్రోజ్, మహమ్మద్ అన్సారీ, మైనార్టీ నాయకులు రజాక్, సూఫీ, ఇర్ఫాన్, బబ్లు, పార్టీ నాయకులు, యక్కల శంకర్ రవి, చినబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఔషధ రంగంలో ఫార్మకోవిజిలెన్స్ ముఖ్యపాత్ర



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యలక్ష్మి

లబ్బీపేట(విజయవాడతూర్పు):నూతన వ్యాధుల చికిత్సా పద్ధతుల్లో ఔషధ ప్రభావాలు పర్యవేక్షించేందుకు, మందుల సమాచారాన్ని సేకరించడం, విశ్లేషించడం ప్రతికూల చర్యలను నివారించడంతో ఫార్మకోవిజిలెన్స్ ముఖ్యపాత్ర పోషిస్తుందని సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కంచర్ల సుధాకర్ అన్నారు. ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాల ఫార్మకాలజీ విభాగం ఆధ్వర్యంలో శనివారం ఫార్మకోవిజిలెన్స్ అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ కంచర్ల సుధాకర్ మాట్లాడుతూ ఫార్మకోవిజిలెన్స్ ప్రోగ్రామ్ ఎంతో ముఖ్యమైనదన్నారు. ఫార్మకాలజీ విభాగాధిపతి డాక్టర్ వెంకట రమణ మాట్లాడుతూ ఔషధాల భద్రతకు ఫార్మకో విజిలెన్స్ ద్వారా ముందడుగు వేయనున్నట్లు పేర్కొన్నారు. ఔషధం జీవిత చక్రంలో భద్రత, సమర్థత అనేవి ముఖ్యమైనవిగా పేర్కొన్నారు. ఫార్మకో విజిలెన్స్ అనేది ఔషధ భద్రతలో అంతర్భాగమని చెప్పారు. అనేక వ్యాధుల నివారణకు సంబంధించిన అధ్యయనంలో జరిగే ప్రతికూల ఘటనలను ఎదుర్కోవడానికి దోహదం చేస్తుందన్నారు. ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.సౌభాగ్యలక్ష్మి మాట్లాడుతూ మందుల వినియోగంలో కొందరు రియాక్షన్స్‌కు గురవుతుంటారని, అలాంటి వారిపై అధ్యయనం చేసి నివారించేందుకు ఈ ఫార్మకో విజిలెన్స్ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.జగన్మోహనరావు, ఫార్మకాలజీ విభాగానికి చెందిన డాక్టర్ స్వర్ణలత, డాక్టర్ వినీత, డాక్టర్ అనూష పాల్గొన్నారు.

వైభవంగా ఊంజల్‌సేవ



విజయవాడ కల్చరల్:తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో పున్నమతోటలోని టీటీడీ కల్యాణమండపం ప్రాంగణంలో శనివారం వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయస్తమాన పూజతో ప్రారంభించి షోడశ ఉపచారాలతో పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామికి పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామి వారికి ఊంజల్ సేవ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా లలితా భజనమండలి చిట్టినగర్ బృందం కోలాటం నిర్వహించారు.

పట్టుదలతో చదివితే ఉన్నత స్థానం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పదో తరగతి విద్యార్థులు పట్టుదలతో ముందుకు సాగితే విజయాలు సొంతం చేసుకుంటారని కేబీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు తెలిపారు. ఎస్ఎఫ్ఐ, యుటీఎఫ్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు మోడల్ పరీక్షను నిర్వహించారు. విజేతలకు బహుమతి ప్రదానోత్సవ సభను శనివారం కేబీఎన్ కళాశాల ఆవరణలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ నారాయణరావు మాట్లాడుతూ పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ నిర్వహించిన ప్రజ్ఞా వికాసం పరీక్షలో విజేతలుగా నిలిచిన విద్యార్థులు రానున్న రోజుల్లో ఉన్నత స్థానాలకు చేరాలని కోరారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.సోమేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు తమకు తామే పోటీగా భావించి ఒత్తిడి లేనటువంటి విద్యను అభ్యసించాలన్నారు. 50వ డివిజన్ కార్పొరేటర్ బోయ సత్యబాబు, గాంధీజీ మహిళ కళాశాల అధ్యాపకులు దుర్గాలక్ష్మి, హిమబిందు, ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షుడు బాలు, ఎన్టీఆర్ జిల్లా కమిటీ సభ్యురాలు జాహిదా నాయకులు మాధవరావు తదితరులు పాల్గొన్నారు.